
కథ

# కళ్యాణం కమనీయం

సుగుణ



**సమస్యలు శ్రద్ధగా విని, స్వభావానుగుణంగా విభజించి, జాగ్రత్తగా పరిష్కారాలు సూచించి, నడవడిక మార్చుకోమని చెప్పడం నా వృత్తి. అంతవరకే! కార్యచరణ విశిష్టంగా బోధించడం కాదు. గీతాబోధలో శ్రీకృష్ణుడు అర్జునుడికి 'ఇలా చేయి' అని ఎన్నడూ చెప్పలేదు. అంతా డొంక తిరుగుడే. అలాంటి పద్ధతి ఒకసారి కౌన్సిలింగ్‌లో ఊహించి ఆచరణలో పెట్టించి సఫలీకృతురాలినయ్యాను. ఆ వివరాలే ఇవి...**

మాలతి ఎంబిఏ పాసయి, తనతోనే చదువు కున్న సీనియర్ మోహన్‌ని పెళ్లిచేసుకుంది. మోహన్ ఇండస్ట్రీ ప్రారంభించి చాలా వృద్ధిలోకి తీసుకువచ్చాడు. మాలతి తన నగలూ, తండ్రి చ్చిన ఆస్తీ ఏ బాధా లేకుండా మోహన్ ఇండస్ట్రీ నడపడానికి ఇచ్చేసింది. తన క్వాలిఫికేషన్ పక్కన పెట్టేసి, గృహిణిగా సెటిల్ అయిపోయింది. మోహన్ సమర్థతకి గౌరవమిచ్చి, భర్తగా వల్లమా లిన ప్రేమ చూపించేది. సాఫీగా నడచిపోతున్న పరిశ్రమలో ప్రభుత్వం చేసిన మార్పుల పరిణా మంగా నష్టాలొచ్చాయి. అవి మోహన్ తట్టుకోలే కపోతున్న తరుణంలో మాలతి అన్న రాజా భార్య జ్యోత్స్న సాయం చేసింది. జ్యోత్స్న తండ్రి బాగా డబ్బు, పరపతి వున్నవాడు. అధికారులతో మంతనాలు జరిపి పరిశ్రమని నిలబెట్టాడు. మోహన్‌కిది తీర్చలేని ఋణంగా కనపడింది. అంతా జ్యోత్స్న వల్లే అనుకున్నాడు. పదేపదే వాళ్లింటికి వెళ్లి కృతజ్ఞతలు తెల్పుతూ, రాకపోకలు పెంచుకు న్నాడు. ఒకరోజు జ్యోత్స్న తండ్రి, 'మా అమ్మాయిని పార్టనర్‌గా చేసుకోవోయ్' అన్నాడు. మోహన్ వెంటనే ఒప్పుకున్నాడు. అప్పటికే వీళ్లిద్దరి మధ్య ఏర్పడిన సాన్నిహిత్యం ఒక కొత్త మలుపు తిరి గింది. ఫోన్లూ, మీటింగ్‌లూ, డిన్నర్లూ, ఇలా కలిసి చేసే పనులకు 'పార్ట్‌నర్ షిప్' వంక అయి పోయింది. ఎవరేం అడిగినా, 'పరిశ్రమని అభి వృద్ధి చేస్తున్నాం' అనేవాడు.

రానురాను మాలతికి తన స్థానభ్రంశం అవు తోందేమోనన్న సంశయం కలిగింది. ఆ మాటే మోహన్‌తో అంటే, 'నీకేమైనా పిచ్చా? తను నాకు చెల్లెలి వరస. ఇలాంటి ఆలోచనలు ఎమ్‌బిఏ చది విన నీకెలా వచ్చాయి?' అని కసిరాడు. అప్పటికి ఏదో సరిపెట్టుకున్నా, మాలతి లోలోన కృంగిపోతూ, విపరీతంగా లావయిపోయింది. స్లిమ్మింగ్ కోర్సులు చేసి ఒళ్లు తగ్గించుకుందామన్నా ఫలితాలు తాత్కాలికంగానే వుండేవి.

ఒకసారి మానసికాందోళన అదుపుతప్పి, అర్ధరాత్రి వీధుల్లో అలా నడుస్తూ వెళ్లిపోయి బీచొడ్డున ఇసుకలో కూర్చుండిపోయింది. పోలీసులు ఆత్మహత్యా ప్రయత్నమని అనుమానపడి, ఇంటికి తీసుకొచ్చి దిగబెట్టేసారు. ఇన్నాళ్ళూ అణ గదొక్కిన మానసిక సంక్షోభం ఈ విధంగా బయట పెట్టేసరికి రెండు కుటుంబాల మధ్యా ఘర్షణల య్యాయి. మాటా మాటా అనుకున్నారు. మాలతి ఇక ఆగలేక, 'వదినా! నా మొగుడ్నొదిలెయ్!' అంది. జ్యోత్స్న తిరుగు జవాబుగా, 'అతన్ని నేనేం కట్టి పడేసుకున్నానా? బిజినెస్ పన్లకి ఆ మాత్రం సమ యమివ్వకపోతే ఎలా?' అంది అన్నదే కాని, తనీ అవమానాన్ని సహించలేకపోతున్నానని నోట్ రాసి పెట్టి నిద్ర మాత్రలు మింగింది. సరిపోయినన్నీ మింగకపోవడంతో హాస్పిటల్లో వారం రోజు లుండి కోలుకుంది.

''దీనికంతటికి నువ్వే కారణం. నా కూతురు అమాయకురాలు. ఎటువంటి ఇన్‌స్టింక్ట్స్ లేవు'' అని జ్యోత్స్న తండ్రి మాలతి మీదే నిందమోపారు. రాజా కూడా వచ్చి, 'మాలూ! జ్యోత్స్నకి అపా లజీ చెప్పు' అని హాస్పిటల్‌కి లాక్కెళ్లాడు. మన సంతా గందరగోళంగా వున్న మాలతి అన్న కాపు రంలో కలతలెందుకు లేపడం అని కాంప్రమైజ్ అయిపోయి హాస్పిటల్‌కి వెళ్లింది. రూమ్‌లో అడుగుపెడుతూ అలాగే వుండిపోయింది. మోహన్, జ్యోత్స్న చేయి తన చేతిలో వుంచుకొని నిమురుతూ, 'ఎందుకిలాంటి పిచ్చి పనిచేసావ్? చూడు, మొహం ఎలా కందిపోయిందో!' అంటూ ఏవో ప్రేమ సంభాషణలు చేస్తున్నాడు. మాలతి అటువైపు ఒక్క చూపు చూసి గిర్రున వెనక్కి తిరిగి వచ్చేసింది.

రాజా, మోహన్ తర్వాత ఏం మాట్లాడుకు న్నారో, కొన్నాళ్లు కలతలు సమసిపోయి ఒకింత ప్రశాంతత ఏర్పడింది. మోహన్ ఇంటిపట్టున వుండడం ప్రారంభించాడు. మాలతి కూడా మెరుగు పడిన పరిస్థితులతో రాజీపడి, మామూలు మనుషుల్లో పడింది. భర్త ప్రవర్తనపై నమ్మకం కలిగి, అతను ఫ్యాక్టరీ పనులు చూసు కుంటూ వుంటే, తను గృహిణి బాధ్యతలు నిర్వ హించుకునేది.

* * *

మాలతి స్నేహితురాలు నీహారిక ఒక మ్యూజిక్ ట్రూప్‌లో చాలా యాక్టివ్‌గా వుండేది. మాలతి చిన్నప్పుడు సంగీతం నేర్చుకుంది. నీహారిక మాలతిని వాళ్ల షోస్‌కి తీసుకెళుతూ, ఒకటి, రెండు సార్లు ఏవో సినిమా పాటలు పాడించింది. నీహారిక భర్త మధురేంద్ర కూడా ట్రూపులో అప్పుడప్పుడు పాడేవాడు. ఒకసారి మాలతితో, 'వూహలు గుసగుసలాడే' డ్యూయట్ పాడుతూ, మధ్యన 'ప్రియా!' అన్నాడు. మాలతి మనసు ఆ క్షణంలో తెలియని అనుభూతికి లోనైంది.

ఆ రోజు నుంచీ మ్యూజిక్ ట్రూపే తన జీవిత



లక్ష్యంగా చేసుకొని, ఎక్కువ సమయం ఆ కార్య క్రమాల్లోనే గడుపుతుండేది. ఆహ్లాదంగా వున్న మనసుకి శరీరం ఎప్పుడూ తోడ్పడుతుంది. మాలతి ఆరోగ్యం చక్కబడి, లావు తగ్గి, పూర్వపు లావణ్యం సంతరించుకుంది.

నీహారిక పేరే అందం. మనిషి చాలా నలుపు. ఆకర్షణీయంగా వుండదు. గొంతు విప్పితే మటుకు కోకిల స్వరమే. ఎందుకు ప్రభావితుడైనాడో కానీ, మధురేంద్ర మాలతి మీద మోజు పెంచుకుని దగ్గరవడానికి ప్రయత్నం చేసి, సఫలీకృతుడ య్యాడు. మాలతి మనసూ, శరీరం అప్పటికే విచ్చుకుని వున్నాయేమో పెద్దగా అభ్యంతరం చెప్పలేదు. మోహన్ ఫ్యాక్టరీ వ్యవహారాల్లో మునిగితేలుతుంటే, ప్రోగ్రామ్స్ పేరిట కలిసి తిరగడం మాలతీ, మధురేంద్రల వంతయింది. అన్యోన్యత వాళ్లసొంతమయింది. ఇది నలుగురి దృష్టిలోనూ పడింది.

నీహారిక ఒక రోజు మాలతిని ప్రోగ్రామ్ మధ్యలో, స్టేజి లోపల నిలదీసి రభస చేసింది. 'నీ గుట్టంతా బయటపెడతాను చూడు, మోహన్‌కి అంతా చెప్పేస్తాను' అని బెదిరించింది. 'ఫోటో లున్నాయి' అని కూడా అంది. 'నా దగ్గర ప్రూఫు వుంది' అనేసరికి మాలతి బెదిరిపోయింది. ఆ సమయంలోనే నా సాయం కోరి వచ్చింది.

''నన్నీ ఆపద నుంచి తప్పించరూ?''అంది.

నాకు ముందు నవ్వొచ్చింది. గజేంద్రుడు విష్ణువుని వేడినట్లుందని తమాయించుకొని ''విషయం ఏమిటి? వివరంగా చెప్పు'' అన్నాను.

భయాందోళనలతో నిండివున్న స్వరంతో జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పి, ''ఇదంతా మోహన్‌కి తెలిస్తే ఇంకేమైనా వుందా? నా కాపురం కూలిపోదూ! అసలు నీహారిక దగ్గర ఫోటోలూ లేవు. అలాంటిదేమీ జరగందే!'' అంది.

''అంతేనంటావా? మరి భయం దేనికి? నీకు మోహన్ మీద ఎంత నమ్మకం వుందో, అతనికి నీ మీద అంతే నమ్మకం వుండవచ్చుగా? ఆందోళ నెందుకూ?'' అన్నాను మాలతి ముఖకవళికలు నిశితంగా పరిశీలిస్తూ, ప్రశ్నలు వేస్తూ, ఎదుటి వారిని పరీక్షగా చూడడం నాకు వృత్తిపరంగా వచ్చిన అలవాటు. వాళ్లు చెప్పేది నిజమో, అబద్ధమో అప్పుడు నాకు తెలిసిపోతుంది.

''మోహన్‌కి నేనంటే ప్రాణం. నా మీద ఈగ వాలినా సహించడు. నీహారిక చెప్పేదేదీ నమ్మడు'' అంది మాలతి.

''చూపిస్తే నమ్ముతాడేమో?'' అన్నాను మాలతి మీదే దృష్టి నిలిపి.

''అదేం లేదండీ! అంతా....'' అంటూ ఆగి పోయి కళ్లు దించుకుంది మాలతి.

''అయితే సమస్యే లేదు. అలాంటప్పుడు నేనెందుకు? ఫీజు దండగ. నీహారిక జెలసీ వుమన్ అని అందరికీ ఈపాటికే తెలిసి వుంటుంది. పట్టిం చుకోకు. నీ ప్రోగ్రాం కొనసాగించు'' అన్నాను ఫీజు రిటర్న్ చేస్తూ....


నోట్లు నా ముందుకు తోసి, మాలతి నెమ్మదైన స్వరంతో అంది.

''ఫోటోలేం లేవు. కానీ... నా లెఫ్ట్‌బ్రెస్ట్ కింద నయాపైసంత పుట్టుమచ్చుంది''

నాకేదో అర్థమయి మౌనంగా వింటూ కూర్చున్నాను.

''ఆ విషయం మోహన్‌కి చెప్తానంటోంది నీహారిక''

''నీహారిక నీ స్నేహితురాలేగా? ఈ విషయం తనకి తెలియడంలో విశేషమేముంది?'' అన్నాను. సమస్య మెల్లిగా ముడివిచ్చుకుంది.




''మోహన్‌కి తప్ప ఇంకెవరికీ ఆ విషయం తెలియదు. మోహన్ నీహారికకి ఎందుకు చెప్తాడు? నేనూ నీహారికతో అంత చనువుగా వుండను. తనకి తెలియడానికి ఒకటే మార్గముంది'' మాలతి కళ్లు దించుకుంది.

''మధురేంద్ర చెప్పాడా?'' అన్నాను, సస్పెన్స్‌ని ముగిస్తూ.

''నీహారికకి తను చెప్పలేదుట. శివ చెప్పాడుట''

''శివ ఎవరు?'' నాకో చిన్న విసుగు ప్రారంభ మయింది.

''మా ట్రూప్‌లో కీబోర్డు వాయిస్తాడు. ప్రోగ్రామ్ అయ్యాక వీళ్లంతా మందు పార్టీ జరుపుకుం టారు. అప్పుడేమైనా మధురేంద్ర...'' మాలతి స్వరం గద్గదమైంది.

''ఇన్సల్ట్ ప్లస్ ఇన్‌జ్యూరీ'' అనుకొన్నాను. అయినా కాస్త మందు పడితే, ఈ మగవారి నాలుకలు అదుపులో వుండవు. మాలతి మీద జాలేసింది. 'పని గట్టుకొని శివ ఇలాంటివి నీహారికకు ఎందుకు చెప్తాడు?' అన్నాను సౌమ్యంగా.

మాలతి ఒక్కసారిగా వెక్కిళ్లు పెట్టి ఏడ్చే సింది. కాసేపయ్యాక సర్దుకొని, 'శివ ప్రోగ్రా మ్స్‌కి రెగ్యులర్‌గా రాడు. ఎక్కువ డిమాండ్ చేస్తాడు. అతని బాధ భరించలేక నీహారిక ట్రూప్‌లోంచి తీసేసింది. ఆ కోపంలో...'

''సరేలే! ఏదో పరిష్కారం ఆలోచిద్దాం. కొన్నాళ్లు ప్రోగ్రాములు ఒప్పుకోకు'' అన్నాను.

''ఇప్పుడు పాడమని నన్నెవరు అడుగుతారు లెండి. మళ్లీ ఎప్పుడు రాను!'' అంది మాలతి లేచి నిలబడుతూ.

''శుక్రవారం రా. మధురేంద్రని వెంట తీసు కొని రా. ఈ సమస్య నీ ఒక్కదానిదేకాదు. ఇద్దరికీ సంబంధించినది. అన్ని కోణాల నుంచీ పరిశీలి స్తేనే కానీ ఏం చెప్పలేను. వెళ్లిరా''అని మాలతి భుజం మీద ఆప్యాయంగా చేయి వేసాను.

శుక్రవారం మాలతి ముందొచ్చి, సెల్‌ఫోన్‌లో మధురేంద్రని రమ్మని చెప్పింది. ఇద్దరం వంటింట్లో ఛీజ్ పకోడాలు చేస్తూ, 'ఎందుకే నీకింత తొందరా' అని పాట ముగిస్తూ వుండగా, ఎప్పుడొచ్చాడో మధురేంద్ర గుమ్మంలో నిలబడి 'జలజా' అన్నాడు. అంతా నవ్వేసి, రిలాక్సయి, డ్రాయింగ్ రూంలోకొచ్చి పకోడీలు తిని, కాఫీ సేవిస్తూ, కాసేపు పాటల గురించి మాట్లాడుకున్నాం.

తర్వాత నేను డైరెక్టుగా పాయింటు కొచ్చేశాను.

''మాలతి తన భర్తను విడిచి వచ్చేస్తుంది. మీరూ నీహారికను వదిలేయండి. ఇద్దరూ కలిసి వుండండి'' అన్నాను మధురేంద్రతో.

''ఎలా వస్తాను?''అన్నారిద్దరూ ఒకే కంఠంతో.

''మరి మీ బంధానికి అర్థమేమిటి?

# ఇల్లే స్వర్గసీమ

మంచి భర్త, పేరు తెచ్చిపెట్టిన సినిమా కెరీర్, అందమైన ఇల్లు....ఇంతకంటే ఇంకేం కావాలి? అంటోంది మాధురీ దీక్షిత్. జుహులో ఈమధ్యే ఓ అందమైన ఇల్లు కొనుక్కుని అక్కడికి మారిపోయిన మాధురీకి అవధులు లేని ఆనందం కలుగుతోంది. ఈ ఇంటిని ఇంత అందంగా తయారు కావడానికి భర్త శ్రీరాంనెనె సూత్రధారి. మంచి ఆర్కిటెక్ట్‌ను పట్టి తమ అభిరుచులకు అనుగుణంగా వాస్తు ప్రకారం ఈ ఇంటిని తీర్చిదిద్దినట్టు తెలిసింది. మార్కెట్లో ఇప్పుడున్న లేటెస్ట్ డిజైన్ల దగ్గర్నించి ఇంటిని ఎంత అందంగా తయారుచేయాలో అన్నిటినీ ఆమె భర్తే దగ్గరుండి మరీ పర్యవేక్షించారట. అందుకే ఇల్లు అంత అందంగా వుందని మాధురీ దీక్షిత్ తెగ మురిసిపోతోంది.



నిర్వచనం చెప్పండి''అన్నాను మృదువుగా.

''మీరు బాగా పాడతారని తెలుసుకున్నాను. మనసు లోతుల్లోకి అంత బాగానూ చూస్తారని తెలుస్తోంది.'' అన్నాడు మధురేంద్ర మెచ్చుకోలుగా.

నేనేం జవాబు చెప్పలేదు. మాలతి కింద చూపులు చూడసాగింది.

మధురేంద్ర కొనసాగించాడు.

''మాలతి తరచూ నా దగ్గరికి వస్తుండేది. పాటలు ప్రాక్టీసు చేయడానికి. ఒకరోజు నీహారిక ఇంట్లో లేదు. మాటల్లో తనకీ మోహన్‌కి కలిగిన కలతల గురించి చెప్పింది. మాలతంటే నాకు సానుభూతే తప్ప ఇంకేం లేదు. నాతో మాట్లాడితే తనకి ఓదార్పుగా వుంటుందని సన్నిహితంగా మసలుకునేవాడిని తప్ప ఇంకే బంధమూ లేదు''

''మరి పుట్టుమచ్చ!'' అన్నాను.

''ఇదేమిటి?''అన్నట్లు మాలతి వైపు చూసాడతను.

''అంతా రత్నప్రభగారికి చెప్పేను. సలహా ఇస్తానన్నారు'' అంది మాలతి.

ఇద్దరూ కాసేపు పట్టుబడిపోయిన దొంగల్లా వుండిపోయారు.

''నీ సంగతి చెప్పు మాలతి! ఇతనంటే నీకేం భావం?'' అడిగాను.

''ఏమో! ఆ రోజు స్టేజి మీద'ప్రియా' అనగానే పులకించిపోయాను. నా చేయి తనచేతిలోకి తీసుకొని 'ఎందుకిలా అయిపోయావు' అని అడిగితే చాలనిపించింది. నాతోనే ఇరవై నాలుగ్గంటలూ గడపాలని అనిపించింది'' అంది మాలతి.

దాచడానికి ఏం లేదని నిర్ణయించుకొని, మధురేంద్ర అన్నాడు, 'వరుసగా కాదేమో కానీ ఇరవై నాలుగ్గంటలు కన్నా ఎక్కువేగడిపాను నీతో'

మాలతి చిరునవ్వు నవ్వింది. మధురేంద్ర స్మృతులు గుర్తుకొచ్చినట్లున్నాయి.

వాతావరణం క్లియర్ అయిపోయేసరికి నేను చెప్పడం మొదలుపెట్టాను.

మీరిద్దరూ వివాహసంబంధాలు తెంపుకుని, కలిసి వుండడానికి సిద్ధంగా లేరు. విడాకుల వల్ల తలెత్తే సమస్యల మాటటుంచితే, ప్రస్తుతం నాకేమనిపిస్తోందంటే దీనికంతా మూలకారణం మాలతికి మోహన్ మీదున్న కోపమేనని. మాలతీ! మోహన్ జ్యోత్స్న వైపు మొగ్గు చూపేసరికి నువ్వు అత్యధికంగా ప్రేమించే భర్తలోని అనురాగబంధాన్ని పోగొట్టుకున్న అనుభూతి చెందావు. అది నీకు అతని ద్వారా లభించదని కూడా అనుకున్నావు. నీ మనసంతా ప్రతీకారంతో నిండిపోయింది. ఇన్నాళ్లు దాన్ని అణగదొక్కినా, మధురేంద్ర 'ప్రియా' అన్న ఒక్క శబ్దంతో దాన్ని బయటకు లాగాడు. మోహన్ ఇవ్వనిది ఇతను ఇవ్వగలడని అనుకున్నావు. ఇద్దరూ దగ్గరయ్యారు. నీహారిక తిరగబడేసరికి స్పృహలోంచి వచ్చారు''

''నేను నిలదీసి ఇలా చేయండి అంటే తుళ్లి పడ్డారు. అంత దూరం ఆలోచించలేదు కనుక... మాలతీ! నువ్వెంత సమాధానపడినా, మోహన్, జ్యోత్స్నల శారీరక సంబంధం సంగతి నీకు తెలుసును. ఎంత లావుగా వున్నా ఇంకా మగవాడిని ఆకర్షించే శక్తి ఇంకా నీలో వుందని మధురేంద్ర రుజువు చేసాడు. దానితో నీ ఆత్మన్యూనతా భావం పటాపంచలయింది. నీ పూర్వపు సంసారం జీవితంలోకి ప్రశాంతంగా ఇప్పుడు తిరిగి వెళ్లిపోగలవు''

''మధురేంద్రా! మీరూ ఒక స్త్రీని వేదననుంచి తప్పించి మామూలు మనిషిని చేసానన్న తృప్తితో, నీహారికతో వివాహ బంధం పటిష్టం చేసుకోండి. ఆమెకి కాస్త సమయమిస్తే ఇదంతా మరిచిపోగలదు. మాలతితో జరిగినది ఒక తీపి జ్ఞాపకంగా మనసులో వుంచుకొని జీవితాన్ని పునర్నిర్మించుకోండి. అనుకుంటాం కానీ, వివాహబంధమనేది అంత సులభంగా తెగ్గొట్టుకోలేం. మనసు లోతుల్లో దాగున్న క్షమాగుణం అడ్డుపడి దానిని తెగిపోనివ్వదు. ఇంతకన్నా ఏం చెప్పను?''అన్నాను:

వాళ్లిద్దరూ లేచి, ఇరుపక్కల నుంచి నా చుట్టూ చేతులేసి నాతో ఒక కొత్త బంధం ఏర్పర్చుకున్నారు.

శ్రీకృష్ణ భగవానుడు చేయెత్తి దీవిద్దామనుకుంటే ఈ బంధంలో ఇరుక్కుపోయిన నాకు సాధ్యం కాలేదు!

★